
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



విజయనగరం

జిల్లా వార్తలు

మంగళవారం 26 మార్చి 2024

నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు: కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 25: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన 48 గంటల్లోనే బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఫొటోలు, ఇతర రాజకీయ సంబంధ ప్రకటనలను తొలగించాలని ఆదేశిస్తే ఇప్పటికీ కనిపించడం సరికాదని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘనపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇకపై ఎక్కడైనా కోడ్ అమలులో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదన్నారు. ప్రైవేటు భవనాలపై ఏర్పాటుచేసే ప్రకటనలను కూడా 72 గంటల్లో తొలగించాల్సి ఉందని, నిర్లిప్తత వద్దని సూచించారు.

కోడ్ ధిక్కరణ

అధికార పార్టీ నాయకుల పట్ల ఇంకా ప్రభుత్వ అధికారుల్లో మోజు తగ్గలేదు. ఎన్నికల కోడ్ వచ్చి పది రోజులు కావస్తున్నా చాలా చోట్ల ఉల్లంఘనలు కన్పిస్తూనే ఉన్నాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నా క్షేత్ర స్థాయి సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. కొన్నిచోట్ల తెలిసి కూడా వదిలేస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికీ నేతల ఫొటోలు కనిపిస్తున్నాయి. కొందరు మాత్రం మొక్కుబడిగా చిన్న కాగితం అంటించి మమ అనిపిస్తున్నారు.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో ఎక్కడికక్కడ ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు
- అధికార పార్టీవైతే చూసీచూడనట్టు వదిలేస్తున్న సిబ్బంది



ఖర్చు దాతలది.. సారథ్యం పేరు ఎమ్మెల్యేది

విజయనగరం పట్టణంలో దాతల ఔదార్యంతో పేదలకు భోజనం పెడుతున్నారు. అయితే దీనికి బోర్డు పెట్టి అందులో ఎమ్మెల్యే సారథ్యంలో పేద ప్రజలకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది చూసిన వారు సారథ్యం ఎమ్మెల్యేది.. ఖర్చు దాతలది అంటూ ఎద్దేవా చేయడం కనిపించింది. కాగా ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా సంబంధిత బోర్డులను తొలగించాల్సి ఉండగా ఎన్నికల సిబ్బంది చూసీచూ డనట్లు వ్యవహరించారు. టీడీపీ చేపట్టిన అన్న క్యాంటీన్లను మాత్రం ఆఘమేఘాల మీద ఎన్నికల సిబ్బంది ఆపించారు. బొబ్బిలి, ఎస్.కోట నియోజకవర్గ కేంద్రాల్లో టీడీపీ నాయకులు నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లను మూసివేశారు.



ఆ స్టిక్కర్లు తొలగించరెందుకో?

విజయనగరం పట్టణంలో తిరుగుతున్న కొన్ని కార్లపై అధికార పార్టీకి చెందిన 'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లు ఇంకా దర్శన మిస్తున్నాయి. ప్రైవేట్ వాహనాలపై పోస్టర్లు పెట్టుకునేందుకు కూడా అనుమతి తప్పనిసరి. వారు పోస్టర్లను ఉంచాలంటే అనుమతి పత్రం కూడా కార్లపై అతికించాల్సి ఉంది. కానీ ఎక్కడా అమలు జరగడం లేదు.

గేమ్‌నూ వదలని ప్రచారం

స్మార్ట్‌ఫోన్ ఉపయోగించే వారిలో సగానికిపైగా క్యాండీక్రష్ గేమ్ ఆడటం చూస్తుంటాం. ఈ అలవాటును కూడా అధికార పార్టీ ఎన్నికల ప్రచారానికి వాడుకుంటోంది. పదేపదే జగన్ ప్రకటనలు ఇస్తుండడంతో చిరాకుగా ఉందని యువకులు వాపోతున్నారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని ఆటలో వచ్చే వైసీపీ యాడ్స్‌ను ఆపాలని కోరుతున్నారు.

\- శృంగవరపుకోట రూరల్



ఆ రంగుల మాటేమిటి?

బొబ్బిలి మున్సిపాలిటీలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం కింద తడిచెత్త, పొడిచెత్త సేకరణ కోసం ఇటీవల 12 వాహనాలను ప్రభుత్వం పంపించింది. వాటన్నింటికీ వైసీపీ రంగులున్నాయి. ఒకటి రెండు తప్ప మిగిలిన వాహనాలన్నీ డ్రైవర్లు లేక షెడ్లకే పరిమితమయ్యాయి. వాటిపై రంగులను మాత్రం ఇప్పటివరకూ తొలగించలేదు.

\- బొబ్బిలి




రోడ్డు మంజూరై నెలలు.. తాజాగా పనులు

విజయనగరం నియోజకవర్గంలో ఎన్నికల సిత్రాల్లో ఇదొకటి. నగరంలోని 33వ వార్డులో ఐనాక్స్ వెనుక రెండు ప్రముఖ ఆసుపత్రులు, కాలనీలు ఉండగా అక్కడకు చేరుకునే రోడ్డు మాత్రం అధ్వానంగా తయారైంది. ఎన్నిసార్లు మొర వినిపించినా నాలుగేళ్లుగా పట్టించుకోని నేతలు 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి రోడ్డు నిర్మాణం కోసం రూ.12 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించి నాలుగురోజల కిందటే చకాచకా రోడ్డు వేశారు. పనులు మంజూరైనప్పుడు కాకుండా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక చేయడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కమిషనర్ వద్ద ప్రస్తావించగా ఎన్నికల కోడ్‌కు ముందే మంజూరైన పనులుగా చెప్పుకొచ్చారు.

\- విజయనగరం(ఆంధ్రజ్యోతి)

తెరపైకి శ్రీదేవమ్మ గోరుముద్ద



బొబ్బిలి, మార్చి 25: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నిబంధనలను ఎవరికి తోచిన రీతిలో వారు అమలు చేసుకుంటున్నారనడానికి ఇదో ఉదాహరణ. బొబ్బిలి మండలం నారాయణప్పవలస యూపీ పాఠశాలలో గోడపై జగనన్న గోరుముద్ద బోర్డుపై జగనన్న పేరును తొలగించారు. అయితే ఉట్టి గోరుముద్ద అని ఉంచితే ఏం బాగుంటుందని అనుకున్నారేమో శ్రీదేవమ్మ అని రాసి పెట్టారు. ఆమె ఎవరని అనుకుంటున్నారా? ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలి పేరు శ్రీదేవి. ఆమె పేరుతో ఇలా బోర్డును మార్చడాన్ని అందరూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

అనుమతి లేకుండా తవ్వకాలేంటి?

- భగ్గుమన్న రామచంద్రపేట గ్రామస్థులు

భోగాపురం, మార్చి25: క్వారీకి అనుమతులు ఇవ్వకుండా ఏవిధంగా తవ్వకాలు చేపడ్తారంటూ రామచంద్రపేట గ్రామస్థులు సోమవారం భగ్గుమన్నారు. గ్రామ సమీపంలో నూతనంగా తవ్వకాలు చేస్తున్నట్లు తెలుసుకున్న వారంతా మూకుమ్మడిగా అక్కడకు చేరుకున్నారు. కొలా రామసూరి, దుక్క అప్పన్న తదితరులు మాట్లాడుతూ ఇటీవల నూతన క్వారీ కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందని, అయితే వారికి ఇంకా అనుమతి ఇవ్వకముందే రాత్రి సమయాల్లో ఎలా తవ్వకాలు చేపడ్తారని ప్రశ్నించారు. ఇక్కడికి సమీపంలో నీటి ట్యాంకు, ప్రభుత్వ పాఠశాల ఉన్నాయని, ఇప్పటికే ఉన్న క్వారీల వల్ల గృహాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న క్వారీలతోనే ఇబ్బందులు పడుతుంటే కొత్తక్వారీ ఎందుకు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. తమ గ్రామాన్ని వేరేచోటుకు తరలించి నచ్చిన విధంగా చేసుకోవాలన్నారు. తహసీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా ఇటీవల ప్రజాభిప్రాయం జరిగిన క్వారీకి అనుమతులు ఇవ్వలేదని, ప్రస్తుతం ఎక్కడ తవ్వకాలు చేపడుతున్నదెవరో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



నిరసన తెలియజేస్తున్న రామచంద్రపేట గ్రామస్థులు

వైభవంగా ఎల్లమ్మ జాతర

గజపతినగరం, మార్చి 25: మరుపల్లి గ్రామంలో ఎల్లమ్మ జాతర సోమవారం ఘనంగా జరిగింది. భక్తులంతా తొలుత గ్రామంలోని ఎల్లమాంబ, పరుశురాం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయాల వద్ద బారులుతీరారు. సాయంత్రం ఎల్లమ్మ తల్లి పూజారి రుద్రాక్షుల సత్యం సిరిమాను అధిరోహించి మూడు పర్యాయాలు తిరిగిన తరువాత పరుశురాం ఆలయ పూజారి కర్ణకోట సిరిమాను అధిరోహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ లెంక రామలక్ష్మితో పాటు గ్రామపెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐ ఎన్.వి.ప్రభాకరరావు బందోబస్తు ఏర్పాట్లు చూశారు.





సిరిమాను సంబరానికి హాజరైన భక్తజనం, (ఇన్‌సెట్)లో సిరిమానుపై పూజారి సత్యం

పెద్దమ్మ ఇంటికెళ్తానని..

- అనుమానాస్పద స్థితిలో వలంటీర్ మృతి
- నేలబావిలో మృతదేహం

బొబ్బిలి, మార్చి 25: పెద్దమ్మ ఇంటికి వెళ్తానని ఇంట్లో చెప్పి బయలుదేరిన ఆ యువకుడు మూడు రోజుల తర్వాత నేలబావిలో మృతదేహంగా కంటపడ్డాడు. బొబ్బిలి పట్టణంలోని ఆఫీసర్స్ క్లబ్ సమీపంలో ఉన్న నేలబావిలో మృతదేహాన్ని స్థానికులు సోమవారం ఉదయం గుర్తించారు. వలంటీర్ వెంకటసాయి రామకృష్ణ(25) విషాదాంతమిది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

స్థానిక బంగారమ్మ కాలనీకి చెందిన అలబోను వెంకటసాయిరామకృష్ణ 15వ వార్డు పరిధిలోని ఏడో నెంబరు సచివాలయంలో వలంటీరుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 22న శ్రీకాకుళంలోని పెద్దమ్మ ఇంటికి వెళతానని చెప్పిన సాయి తిరిగి రాలేదు. మూడురోజుల తరువాత సోమవారం బావిలో శవమై స్థానికుల కంటపడ్డాడు. మృతదేహం పూర్తిగా ఉబ్బిపోయి దుర్గంధభరితంగా ఉండడంతో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐలు పి.లోవరాజు, చదలవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో మృత దేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రాజారమేష్ మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. శ్రీకాకుళం వెళుతున్నట్లు ఇంటి దగ్గర చెప్పిన రామకృష్ణ అక్కడికి రాలేదని బంధువులు చెప్పడంతో ఉలిక్కిపడ్డ తల్లి పార్వతి మూడు రోజులుగా వెతుకుతోంది. తెలిసిన వారందరికీ ఫోన్ చేసింది. కుమారుడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో భయాందోళనతోనే ఉంది. సోమవారం ఉదయం స్థానికుల నుంచి అందిన సమాచారంతో ఉన్నచోటే కూలిపోయింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరం కాలేదు.



వెంకటసాయిరామకృష్ణ(ఫైల్)

- కాగా ఈ నెల 1న పట్టణానికి చెందిన కిలారి నాగరాజు అనే వలంటీరు రైలు కిందపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మరువక మునుపే ఇప్పుడు వెంకట సాయిరామకృష్ణ మృతిచెందాడు. వరుసగా వలంటీర్లు మృతిచెందడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక ఇంకేవైనా బలమైన కారణాలు ఉన్నాయా? అని అనుమానిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఇన్నాళ్లూ పట్టించుకోలేదేం?

- ఎమ్మెల్యేని నిలదీసిన గిరిజన మహిళ

బొబ్బిలి, మార్చి 25: బొబ్బిలి మండలం కాశిందొరవలస పంచాయతీ పరిధిలోరి గిరిజన గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి శంబంగి వెంకటచినఅప్పలనాయుడును గిరిజన మహిళ నిలదీసింది. డొంగురువలస గ్రామంలో కోటిపల్లి సోములమ్మను ఎమ్మెల్యే ఓటు అడుగుతుండగా ఆమె ప్రశ్నల వర్షం కురిపించింది. 'మాలో ఏ మార్పూ రాలేదు. అప్పటికీ ఇప్పటికీ అలాగే ఉండిపోయాం. మా సమస్యలు ఎందుకు పట్టించుకోలేదు?' అంటూ ప్రశ్నించింది. రోడ్డు ముక్కలుముక్కలుగా తయారైందని నిరాశ వ్యక్తం చేసింది. అనంతరం ఎమ్మెల్యే ఆమె భుజాన్ని తట్టి వారించే ప్రయత్నం చేసి వెళ్లిపోయారు.



ప్రశ్నిస్తున్న గిరిజన మహిళను వారిస్తున్న ఎమ్మెల్యే

హుషారుగా హోలీ





జిల్లాలో హోలీ జాలీగా సాగింది. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కేరింతలు కొట్టారు. యువకులంతా రంగుల్లో తేలియాడారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ రోజంతా సందడి చేశారు. డీజే సాంగ్స్, తీన్‌మార్ మ్యూజిక్‌తో హుషారుగా గడిపారు. ఫాల్గుణ మాసం శుద్ధ పౌర్ణమి నాడు హోలీపండగ జరుపుకోవడం ఆనవాయితీ. సెలవు కావడంతో అన్ని వయసులవారూ హోలీ సంబరాల్లో మునిగితేలారు. కాలనీవాసులు, అపార్టుమెంట్లలో నివశిస్తున్నవారు, ప్రజాప్రతినిధులు ఇలా అందరూ భాగస్వాములయ్యారు. సహజ సిద్ధమైన రంగులనే వినియోగించుకుని ఆహ్లాద వాతావరణంలో పండగ చేసుకోవడం కనిపించింది. విజయనగరంలోని చిన్నవీధి, కోట, మయూరి, రైల్వే స్టేషన్, కన్యకా పరమేశ్వరి జంక్షన్, చిన్నవీధి ప్రాంతాలు రంగులమయమయ్యాయి.

\- విజయనగరం (ఆంధ్రజ్యోతి)





విజయనగరం: రింగురోడ్డులోని ఓ ప్రైవేటు పాఠశాల మైదానంలో కేరింతలు కొడుతున్న యువత

చంద్రబాబును సీఎం చేయాలి

బాడంగి: రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందని విజయనగరం జిల్లా టీడీపీ కొప్పలవెలమ బీసీ సాధికారత కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు కోరారు. సోమవారం కోడూరు గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటి ప్రచారం చేశారు. మొదటిరోజు 150 కుటుంబాలకు సూపర్ సిక్స్ పథకాలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తుంటే బేబీనాయన గెలుపు ఖాయమనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.

కోళ్ల పుట్టినరోజు వేడుక

లక్కవరపుకోట: టీడీపీ ఎస్.కోట నియోజకవర్గ అభ్యర్థి కోళ్ల లలితకుమారి పుట్టినరోజు వేడుకలు ఎల్.కోటలోని ఆమె స్వగృహంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. 5 మండలాల నుంచి వందలాది మంది నేతలు, కార్యకర్తలు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తవలస, ఎస్.కోట మండలాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై గజమాల, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అభిమానుల మధ్య లలితకుమారి కేక్ కట్‌చేసి కార్యకర్తల మధ్య పుట్టినరోజు జరుపుకున్నారు. 5 మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

నిత్యావసరాల పంపిణీ

విజయనగరం రూరల్: మారుతీ స్వయం సేవా సంఘం నెలవారీ కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. 50 మంది నిరుపేదలకు బియ్యం, ఇతర నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుత్తూరు చంద్రశేఖర్, కణపాక నాగరాజు, చలుమూరి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు..

రోగులకు అన్నదానం

రాజాం: మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం లెప్రసీ నివారణ కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు సూచనల మేరకు మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. జి కొండలరావు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు అనుసరణీయం

శృంగవరపుకోట: నేటి యువత స్వామి వివేకానందుని బోధనలు అనుసరించాలని యోగ మందిర్ అధ్యక్షుడు దార్రాజు కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాలలో వసతి గృహాధికారి కుసుమ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జీవి తం-సందేశం అనే కార్యక్రమం నిర్వహించారు. వివేకా నందుని బోధనలతో కూడిన పుస్తకాలను యువతకు అందించారు. కార్యక్రమంలో మోక్ష విద్యామందిర్ నిర్వాహకుడు శీల కోటేశ్వరరావు, గౌరవ సలహాదారు తమటపు అప్పారావు, శ్రీహరి, కృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రామభద్రపురం: మండల కేంద్రంలోని చెక్ పోస్టు వద్ద సోమవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలలో ఏఎస్‌ఐ జి.భాస్కరరావు, హెచ్‌సీ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలపై పోస్టర్లు తొలగింపు

బాడంగి: కోడూరు గ్రామంలో సుమారు 20 ఆటోలకు కాంగ్రెస్ పార్టీకి చెందిన స్టిక్కర్లను మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీం లీడర్ ఆంజనేయులు తొలగించారు. సోమవారం కోడూరు గ్రామంతోపాటు అచ్చియ్యపేట గ్రామంలో ఉన్న బూత్ నెంబరు 200ను పరిశీలించి అక్కడి గ్రామస్థులతో ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఇళ్లపైన, గ్రామాల్లోగానీ ఏ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, జెండాలు పెట్టవద్దని సూచించారు. పోలీసు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలి

రాజాం: ల్యాండ్ టైట్లింగ్ చట్టం వల్ల కడప జిల్లాలో చేనేత కుటుంబాలు ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వైసీపీ ప్రభుత్వంపై మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మొండి వీధిలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద చేనేత కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

విజయనగరం క్రైం: పోలీసు శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీలు కొనసాగుతున్నప్పటికీ రోజూ బెల్టుషాపులకు మద్యం తరలిస్తూ విక్రయదారులు పట్టుబడుతున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వారిపై 16 కేసులు నమోదు చేసి 60.3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై 32 కేసులు, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై 20 కేసులు నమోదు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

రేగిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రేగిడి ఎస్‌ఐ శ్రీనివాస్ ప్రజలను హెచ్చరించారు. పెద్ద లింగాలవలసలో సోమవారం సాయంత్రం రేగిడి పోలీసులు ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతలపై చైతన్య సమావేశం నిర్వహించారు. సిబ్బంది ఉన్నారు.

పార్టీ నేతలతో బొత్స సమావేశం

లక్కవరపుకోట (కొత్తవలస): మండల కేంద్రమైన కొత్తవలసలోని వైసీపీ క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య నేతలు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుని, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో 5 మండలాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మోక్షానికి మార్గం జ్ఞానమే


మాట్లాడుతున్న స్వామిజీ విష్ణు దేవానంద సరస్వతి

రేగిడి: మోక్షానికి ప్రధాన మార్గం జ్ఞానమే నని.. ఆధ్యాత్మిక చింతనతో దీనిని సముపార్జించుకోవాలని పెందుర్తికి చెందిన శివానందాశ్రమ పీఠాధిపతి స్వామి విష్ణు దేవానంద సరస్వతి అన్నారు. రేగిడి దత్తపీఠంలో సోమవారం హోలీ పౌర్ణమి సందర్భంగా దత్త గురువు కిమిడి సత్యనారాయణ అధ్యక్షతన దత్తజ్ఞాన మహాసభ నిర్వహించారు. పెందుర్తికి చెందిన స్వామీజీతో పాటు పాలకొండ సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ, దత్తపీఠ కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టర్, పాలకొండకు చెందిన జడ్డు జగ్గారావు, దత్తభక్తులు వై.భాస్కరరావు, కుడుతుల మురళి, జల్లు శివ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్నాళ్లో ?

- ధాన్యం బిల్లుల కోసం రైతుల ఎదురు చూపు
- జిల్లా వ్యాప్తంగా రూ.70 కోట్లు పెండింగ్



గంట్యాడ మండలం వసంత గ్రామానికి చెందిన బంగారునాయుడు ఈ ఏడాది జనవరి 18న తన పొలంలో పండిన 600 బస్తాల ధాన్యాన్ని విక్రయించేందుకు గాను స్థానిక రైతు భరోసా కేంద్రానికి పంపించారు. అప్పటి నుంచి ఇప్పటికి సుమారు రెండు నెలలు పూర్తయినా ఆయన పంపించిన ధాన్యం బస్తాలకు సంబంధించి బిల్లులు అందలేదు. దీంతో ఆ రైతు ధాన్యం డబ్బుల కోసం అనేక సార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నారు. ప్రభుత్వం ధాన్యం డబ్బులు ఎప్పుడు మంజూరు చేస్తుందో తెలియక నిరీక్షిస్తున్నాడు. ఈ సమస్య ఆ ఒక్క రైతుది మాత్రమే కాదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

కలెక్టరేట్, మార్చి 25

జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు ధాన్యం డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి పండగ తరువాత ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా మూడు లక్షలు మెట్రిక్ టన్నులకు పైబడి రైతుల నుంచి ధాన్యం సేకరించినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది సంక్రాంతి పండగ ముందు వరకూ జిల్లా వ్యాప్తంగా రూ.464 కోట్లు రైతులకు చెల్లించినట్లు అధికార గణంకాలు వెల్లడించాయి. అయితే సంక్రాంతి పండగ తరువాత రైతు భరోసా కేంద్రాలకు పంపించిన ధాన్యానికి సంబంధించి ఇప్పటి వరకూ బిల్లులు మంజూరు కాలేదు. ఆర్‌బీకేలకు ధాన్యం పంపించి నెలలు దాటినా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆయా రైతులు నిరీక్షణ చేయాల్సి వస్తోంది. రైతు భరోసా కేంద్రానికి ధాన్యం ఇచ్చిన రైతులకు 21 రోజుల్లో బిల్లులు చెల్లిస్తామని ఆయా శాఖ అధికారులు ప్రకటనలు చేశారు. అయితే ధాన్యం ఇచ్చి 70 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకూ బిల్లులు మంజూరు కాకపోవడంతో రైతులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.70 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బిల్లులు ఎప్పుడు వస్తాయో? అనేది తెలియక రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం బిల్లులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

రెండురోజుల్లో ఖాతాలకు జమ చేస్తాం..

జిల్లాలో సుమారు రూ.70 కోట్ల నిధులను రైతులకు బిల్లుల రూపంలో చెల్లించాల్సి ఉంది. ఇలా పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాకు జమ అవుతాయి.

\- మీనాకుమారి, సివిల్ సప్లయ్ సంస్థ జిల్లా మేనేజర్

ఎన్నికల వేళ ఇసుకాసురులపై నిఘా


పారాది వేగావతి నదిలో ఇసుక వనరులను పరిశీలిస్తున్న అధికారులు

బొబ్బిలి: ఎన్నికల వేళ అధికారులు ఇసుకాసురులపై దృష్టి సారించారు. బొబ్బిలి మండలంలో పారాది, కారాడ, అలజంగి, పెంట తదితర గ్రామాల పరిధిలో వేగావతి నదీ పరీవాహక ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా రవాణా అవు తోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రాజకీయ పార్టీ నాయకుల ప్రాబల్యం కొంతమేర తగ్గింది. దీంతో అధికారులు ఓ అడుగు ముందుకేశారు. తహసీల్దారు పి.త్రినాథరావునాయుడు, ఆర్‌ఐ కల్యాణచక్రవర్తి, ఎస్‌ఐ లోవరాజు, వీఆర్‌ఓ రవి తదితరుల బృందం సోమవారం అలజంగి, కారాడ, పెంట, పారాది గ్రామాల్లో ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. యంత్రాలను వినియోగించి ఇసుకను అక్రమంగా తరలిస్తూ తొలిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మూడోసారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. దీనికి పూర్తి బాధ్యత గ్రామ రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. గ్రామాలలో దండోరా ద్వారా ప్రజలందరికీ అవగాహన కల్పించాలని వీఆర్వోలను, వీఆర్ఏలను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

జామి వైసీపీ నేతల తీరుపై దృష్టి సారించాలి


అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

జామి: జామి మండ లంలోని వైసీపీ నేతల కద లికలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండా రు పెదబాబు కోరారు. సో మవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ సోమవారం మండల కేంద్రంలో ఉన్న వైసీపీ నేతలు వలంటీర్లకు వాట్సాప్ వాయిస్ మెసెజ్‌లు పెట్టారని... అందు లో వారి ఇళ్ల వద్దకు మీటింగ్‌కు వచ్చాక అక్కడి నుంచి కొత్తవలసలో ఎమ్మెల్యే ఇంటి వద్ద నిర్వహించే ఎన్నికల సమావేశానికి వెళ్లాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ విషయమై ఈఆర్‌వో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తాను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశానని తెలిపారు. అనంతరం ఎన్నికలు సజావుగా జరగాలని కోరుతూ జామిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు


కొట్టక్కి ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మార్వో

రామభద్రపురం, మార్చి 25: మండలంలోని ఇసుక రీచ్‌లను తహసీల్దార్ ఆకుల సులోచనారాణి సోమవారం పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిరోధించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. మండలంలోని కొట్టక్కి, కొండకెంగువ, రొంపల్లి గ్రామాల పరిధిలోని వేగావతి నది ఇసుక రీచ్‌లను సోమవారం పోలీసులతో వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే ఆయా రీచ్‌ల వద్ద ప్రభుత్వ సిబ్బందిని కూడా నియమించామన్నారు.

శ్రీరాముని అడుగుజాడల్లో నడవాలి


మాట్లాడుతున్న శ్రీనివాసానంద స్వామిజీ

రేగిడి: హైందవ సంస్కృతీ సంప్రదాయాలు అత్యంత గొప్పవని.. ప్రతి ఒక్కరూ శ్రీరాముని అడుగుజాడల్లో నడవాలని గారపేట ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద స్వామీజీ పేర్కొన్నారు. వన్నలిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకోదండ సీతారామ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ముగిసింది. ఆఖరి రోజు ఖండ్యాంకు చెందిన అంపోలు రుద్రకోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసనంద స్వామీజీ మాట్లాడుతూ శ్రీరాముని ఆదర్శ పాలన, గొప్పతనాన్ని వివరించారు. ప్రతి గ్రామంలో శ్రీరామాలయాలు నిర్మించి.. హిందూ ధర్మాన్ని, సనాతన సంప్రదాయాలను కాపాడాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ, సర్పంచ్ గార రమణ, వన్నలి, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలి


పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎటువంటి రాజకీయ వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి రాజకీయ కక్షలు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమికి మద్దతివ్వండి

విజయనగరం రూరల్, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అదితి గజపతి రాజుకి మద్దతుగా తెలుగుదేశం పార్టీలోని వివిధ విభాగాలు విస్తృత ప్రచారం నిర్వహించాయి. నగరంలోని 42, 43, 44 డివిజన్ల పరిధిలో ఉన్న డ్వాక్రా గ్రూప్ సభ్యులతో టీడీపీ మహిళా విభాగం నాయకురాలు పత్తిగిల్లి సూర్యకుమారి సోమవారం సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీ, జనసేన, బీజేపీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. మహిళా విభాగం నాయకురాళ్లు అనురాధ బేగం, మురిపెన పద్మలత తదితరులు పాల్గొన్నారు. ● నగరంలోని 32 వ డివిజన్ పరిధిలోని తోటపాలెంలో టీడీపీ ఎస్‌సీ సెల్ విభాగం నాయకులు మంగళవారం దళితుల ఇంటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎస్‌సెల్ నాయకులు మామిడి రవిశంకర్, కందువా ప్రకాష్, శంకరరావు పాల్గొన్నారు. ● టీడీపీ రాష్ట్ర బ్రాహ్మణ విభాగం ఆదేశాల మేరకు నగర పరిధిలోని 9వ డివిజన్‌లో 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు రైతుబజారు, గెడ్డవీధి, సుబ్రహ్మణ్యపేట, మహారాణి పేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ● విజయనగరం మండల పరిధిలోని రాకోడు, పినవేమలి గ్రామాల్లో తెలుగుయువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ సంయుక్తంగా 'ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు.

బొబ్బిలిలో బేబీనాయన ప్రచారం


పార్టీలో చేరిన వారితో బేబీనాయన

బొబ్బిలి, మార్చి 25: బొబ్బిలి తెలుగుదేశం- జనసేన- బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన సోమవారం పట్టణంలోని 9 వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆయనను సాదరంగా ఆహ్వానించి పూలమాలలు వేసి, హారతులిచ్చి ఆశీర్వదించారు. అందరికీ టీడీపీ హామీలకు సంబంధించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ప్రచారంలో ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, తొమ్మిదోవార్డు ఇన్‌చార్జి సిరిపురపు వెంకటరమణ, కోసూరు బ్రహ్మాజీ, త్రినాథరావు, టీడీపీ, జనసేన సీనియర్ నాయకులు రాంబార్కి శరత్‌బాబు, వాసిరెడ్డి సత్యనారాయణ, రౌతు రామ్మూర్తి, క్లస్టర్, బూత్‌యూనిట్ ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు. సోమవారం రాత్రి స్థానిక కోటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ మాఫియా, వ్యాపారం, వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయిందని ఆరోపించారు. బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన 30 ఎస్సీ కుటుంబాల వారు వైసీపీని వీడి సోమవారం బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరారు. జిల్లా ఎస్సీ ఎస్టీ జేఏసీ కన్వీనరు గర్భాపు రమేష్ ఆధ్వర్యంలో సోమవారం బొబ్బిలి కోటకు వచ్చి టీడీపీలో చేరారు.

కాగితాపల్లి హైస్కూల్‌కు బహుమతి


ప్రథమస్థానంలో నిలిచిన కాగితాపల్లి హైస్కూల్ విద్యార్థుల హత్యా- భ్రమ ప్రాజెక్టు

రేగిడి: జన విజ్ఞాన వేదిక జిల్లా స్థాయి ఆన్ లైన్ సైన్స్ ప్రయోగాల పోటీల్లో రేగిడి మండలం కాగితాపల్లి హైస్కూల్ ప్ర దర్శించిన హత్యా- భ్రమ ప్రాజెక్టు ప్రథమ స్థానా నికి ఎంపికైనట్లు హెచ్ ఎం ప్రభాకర్ సోమవారం తెలిపారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గొర్లె రమేష్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థి టెంపల రాజేష్ హత్యాభ్రమ ప్రాజెక్టు రూపొందించారని తెలిపారు. వీరిని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు జరజాన నీలయ్య, శాసపు సత్యంనాయుడు, ఎంఈఓలు వరప్రసాదరావు, బి.ఎరకయ్య, హెచ్‌ఎం పి.ప్రభాకర్, పి.వేణుగోపాల్ తదితరులు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఎస్.కోట బర్మాకాలనీలో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: మండల కేంద్రమైన ఎస్.కోట బర్మాకాలనీ, శ్రీనివాసా కాలనీ, రైల్వే కాలనీల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు కిరణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు.

ఎస్ఎఫ్ఐ విజయోత్సవ ర్యాలీ


నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దాసన్నపేట: నగరంలోని కోట జంక్షన్ వద్ద సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జేఎన్‌టీయూ విద్యార్థి సంఘ ఎన్నికల్లో లెఫ్ట్ ప్యానల్ విజయోత్సవం సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పూడి రామ్మోహనరావు, నాయకులు రాము వెంకటేష్, సౌమ్య, రవికుమార్, రాజు, రమేష్, జగదీష్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నాం


ముషిడిపల్లి పంపుహౌస్ వద్ద కార్మికుల నిరసన

శృంగవరపుకోట రూరల్: ముషిడిపల్లి పంప్ హౌస్‌లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యంలో వీరు మాట్లాడుతూ నాలుగు నెలల జీతం ఈ నెలలో చెల్లిస్తామన్న కాంట్రాక్టర్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి జిల్లాలోని నెలిమర్ల, రామతీర్థంలో ఉందన్నారు. ఈ విషయమై మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. సీఐటీయూ నేత రమణ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని, దీనిని అధికారులు అడ్డుకోవాలని కోరారు.

బాలుడి హత్య కేసులో యావజ్జీవ కారాగారం

- తీర్పు వెలువరించిన ఫ్యామిలీకోర్టు

రాజాం రూరల్, మార్చి 25: సంతకవిటి మండలం కొండగూడెం గ్రామంలో 13 ఏళ్ల బాలుడిని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు కొండపల్లి గోవిందరావుకు యావజ్జీవ కారాగారశిక్షతో పాటు రూ. 2 వేలు జరిమానా విధిస్తూ శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి టి.భాస్కరరావు సోమవారం తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించి రాజాం రూరల్ సి.ఐ. ఎస్. శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం లింగాలవలస గ్రామానికి చెందిన రెడ్డి సూరపునాయుడు కుటుంబం సంతకవిటి మండలం కొండగూడెం గ్రామానికి వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అప్పటి నుంచి అక్కడ గోవిందరావు, సూరపునాయుడు కుటుంబాల మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకునేవి. దీంతో సూరపునాయుడు కుటుంబంపై కక్ష పెంచుకున్న గోవిందరావు అవకాశం కోసం వేచిచూసి ఎనిమిదో తరగతి చదువుతున్న సూరపునాయుడు కొడుకు దుర్గాప్రసాద్‌ని గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడివద్ద మే 1, 2021 తేదీన రాత్రి 8 గంటల సమయంలో కొండపల్లి సింహాచలం(ఏ2), కొండపల్లి శంకర్రావు(ఏ3), కొండపల్లి లక్ష్మీనారాయణ(ఏ4), కొండపల్లి అన్నపూర్ణ(ఎ5) సహకారంతో హత్య చేశాడు. అప్పటి సంతకవిటి ఎస్.ఐ. సీహెచ్.రామారావు కేసు నమోదు చేయగా అప్పటి రాజాం రూరల్ సి.ఐ నవీన్‌కుమార్ దర్యాప్తు ప్రారంభించి అయిదుగురు నిందితుల్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ఆపై రాజాం రూరల్ సి.ఐ. కె.శ్రీనివాస్ ప్రత్యేకశ్రద్ధతో కోర్టు హెచ్.సి. తారకేశ్వర్రావు సహకారంతో సాక్ష్యాలను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ వాదనలు వినిపించారు. ప్రధాన నిందితుడు కొండపల్లి గోవిందరావుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి టి.భాస్కరరావు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


జితేంద్ర (ఫైల్)

గరివిడి, మార్చి 25: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గరివిడి ఎస్‌ఐ ఎల్ దామోదరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండల చింతపల్లిపేట గ్రామానికి చెందిన ఎం.జితేంద్ర(23) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో గరివిడి రైల్వే బ్రిడ్జి కింద అనుమనాస్పదంగా తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో పడి ఉన్నాడు. రక్తపు మడుగులో ఉన్న జితేంద్రను తోటి ఆటో డ్రైవర్లు గుర్తించి చీపురుపల్లిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడి తండ్రి కనకారావు తన కుమారుడి మరణంపై అనుమానాలున్నాయని గరివిడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసి నివేదికను పలాసా రైల్వే పోలీసులకు పంపించామని గరివిడి ఎస్‌ఐ దామోదరరావు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో మహిళకు గాయాలు

గజపతినగరం: కొత్తబగ్గాం గ్రామంలో ఓ మహిళ అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన సారికి బంగారమ్మ సోమవారం పొలంలో చెత్తకుప్పలకు నిప్పు పెట్టింది. మంటలు చెలరేగి బంగారమ్మ చీరకు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. దగ్గరలో గల చేపల చెరువు నుంచి వస్తున్న స్థానికులు చూసి 108 వాహనంలో బాధితురాలిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడడంతో న్యాయాధికారి కె.కనకలక్ష్మి బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బంగారమ్మ భర్త అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్.వి.ప్రభాకరరావు తెలిపారు.

నీలగిరి తోట దగ్ధం

భోగాపురం: చేపలకంచేరు గ్రామ సమీపంలో సోమవారం అరజర్ల ఎర్రన్నకు చెందిన నీలగిరి తోట అగ్నికి ఆహుతైంది. గ్రామ సమీపంలో ఉన్న నీలగిరి తోటలో ఉన్నట్టుండి మంటలు వ్యాపించాయి. నేలరాలిన ఆకులు బాగా ఎండి ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. స్థానికులు సమీపంలో ఉన్న నీటితో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. చిట్టివలసకు చెందిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న వీఆర్వో సుజాత ఘటన స్థలాన్ని పరిశీలించి.. వివరాలు నమోదు చేసుకున్నారు.

ఐకమత్యంతో పనిచేద్దాం

- నెల్లిమర్ల మండల టీడీపీ ఆత్మీయ సమావేశం


మాట్లాడుతున్న లోకం మాధవి

విజయనగరం/నెల్లిమర్ల: నెల్లిమర్ల మండల టీడీపీ ఆత్మీయ పరిచయ సమావేశాన్ని విజయనగరం పట్టణంలోని ప్రైవేట్ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి లోకం నాగమాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకులంతా ఐకమత్యంతో ఏకతాటిపై పనిచేసి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. నియోజవర్గంలో యువతకు నిరుద్యోగ సమస్య లేకుండా కృషి చేస్తానన్నారు. వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అంతకుముందు టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, కడగల అనంద్ కుమార్, సువ్వాడ వనజాక్షి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులను మాధవికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు లోకం ప్రసాద్, కంది చంద్రశేఖర్, మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మినాయుడు, గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖను గంజాయి హబ్‌గా మార్చారు: కోండ్రు


టీడీపీలో చేరిన వారితో కోండ్రు

రాజాం: విశాఖపట్నాన్ని క్యాపిటల్ రాజధానిగా మారుస్తానని ప్రకటించిన సీఎం జగన్‌రెడ్డి గంజాయి మాఫియా కేంద్రంగా మార్చారని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ విమర్శించారు. సోమవారం రాజాంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, వంగా వెంకటరావు, వల్లూరు గణేష్, మాడుగుల జయరాం తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక శ్యాంపురంలోని టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలం సోమరాజుపేటకు చెందిన 60 కుటుంబాలు, వంగర మండలం శివ్వాం గ్రామానికి చెందిన 25 ఎస్సీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు వేసి కోండ్రు సాదరంగా వారిని ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీసం రోడ్లకు మరమ్మతులు చేయించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. శివ్వాంకు చెందిన బిళ్లాన రామారావు, శివుడు, చిలక సింహాచలం, ధర్మాన రవి, సంజీవి, రాములు, కుప్పిలి రాజు ఉన్నారు.

వైసీపీ భూదాహానికి బలైన వారికి శ్రద్ధాంజలి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో వైసీపీ భూ దాహానికి బలైన కుటుంబానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు కురుపాం నియోజకవర్గ కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ నాయకుల భూదాహానికి నిండు కుటుంబం బలైందని, ఈ సంఘటన ఎందరినో కలచి వేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే ఇటువంటి సంఘటనలు జరగవని ఆమె అన్నారు.

జగన్ పాలనలో ఆస్తులకు రక్షణ లేదు

గరుగుబిల్లి: సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో బలహీన వర్గాలకు చెందిన వారి ఆస్తులకు రక్షణ లేదని టీడీపీ అరకు పార్లమెంటు బీసీ విభాగం చైర్మన్ బూరాడ రామ్‌మోహనరావు విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం సొంత జిల్లాలో మూడెకరాల భూదాహానికి ముగ్గురిని బలి తీసుకున్నారన్నారు. చేనేత కుటుంబం ఆత్మహత్యకు జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు సోము వెంకటరమణ, సీహెచ్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపులను దూరం చేసుకోవద్దు

పాలకొండ: తూర్పు కాపు సామాజిక వర్గాన్ని, నాయకులను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి దూరం చేసుకుంటుందని ఆ సంఘ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, టీడీపీ నాయకుడు వరహాలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు తక్షణమే స్పందించి తూర్పు కాపులకు తగిన ప్రాధాన్యతను ఇచ్చి, పార్టీ గెలుపునకు తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం నాయకులు పలవలస సత్యనారాయణ, పాలవలస రామినాయుడు, వండాన కూర్మారావు పాల్గొన్నారు.

క్రైస్తవుల పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న క్రైస్తవులు

భామిని: ఏసు ప్రభువు శ్రమకాలంలో భాగంగా సోమవారం బత్తిలి నుంచి బాలేరు ప్రేమగిరి ఆలయం వరకు సుమారు 20 కిలో మీటర్లు పాదయాత్ర చేపట్టారు. మార్గ మధ్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపడుతూ బత్తిలి ఫాదర్ థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రేమగిరి క్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి అన్నదానం ఏర్పాటుచేశారు. దీక్షదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లివిరిలో కామదహనం


కామదహనం చేస్తున్న దృశ్యం

భామిని: లివిరి గ్రామంలో డోలోత్సవాల్లో భాగంగా వంశధార నదీ తీరంలోగల తోటలో కామదహనం చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి, తోటలో యజ్ఞం చేశారు. అగ్నిదేవతకు పూజలు చేశారు. గజపతి మహారాజుల ఆనవాయితీగా కామదహనం చేపట్టారు. లివిరితో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, రాధాకృష్ణుల దర్శనానికి మండలంతోపాటు ఒడిశా రాష్ట్రంలోని పలు గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

తవిటాచారి సేవలు స్ఫూర్తిదాయకం

గరుగుబిల్లి: నాటక రంగంలో ఎన్నో పాత్రలను పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందిన కళాకారుడు చింతాడ తవిటాచారి సేవలు స్ఫూర్తిదాయకమని హైదరాబాద్ కేర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ గుల్ల సూర్యప్రకాశరావు, మరో వైద్యుడు ద్వారపురెడ్డి రామ్మోహనరావు అన్నారు. తవిటాచారిని సోమవారం తన స్వగ్రామం రావుపల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి ధనుంజయరావు, మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గుల్ల అన్నపూర్ణమ్మ, గుల్ల సింహాచలం, గుల్ల శంకరరావు, రంభ శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జాడేలేదు

సాలూరు: వైసీపీ హయాంలో పథకాల పేరుతో ప్రచారం తప్పితే, అభివృద్ధి జాడే లేదని సీపీఎం నాయకుడు ఎం.కృష్ణమూర్తి ఆరోపించారు. పట్టణంలో సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీతాల బకాయిలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న పంప్ హౌస్ కార్మికులు

నెల్లిమర్ల: విజయనగరం కార్పొరేషన్ ప్రజానీకానికి తాగు నీరు అందిస్తున్న ముషిడిపల్లి, రామతీర్థం, నెల్లిమర్ల మాస్టర్ పంపు హౌస్ కార్మికులు సోమవారం ఆ పంపుహౌస్‌ల వద్ద నిరసన చేపట్టారు. తమ జీతాల చెల్లింపు విషయంలో మునిసిపల్ డీఈ, కాంట్రాక్టర్ మాట తప్పారని ఆరోపించారు. సంఘ నాయకుడు జగన్మోహనరావు, మురళి, నారాయణరావు, పైడిరాజు మాట్లాడుతూ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో సోమవారం జీతాలు చెల్లిస్తామని మాట ఇచ్చారని తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరశన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

కల్వర్టు నిర్మించరూ..


ఆందోళన చేస్తున్న స్థానికులు

గజపతినగరం: పురిటిపెంట రైల్వే కాలనీలోగల శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల రైల్వే మూడో లైను పనులు చేపడుతున్న నేపథ్యంలో ఉన్న కల్వర్టును మూసి వేశారు. దీంతో ఎగువన ఉన్న రాళ్ల చెరువు నీరు రావడంతో శ్మశాన వాటికలో నీరు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ వరి పంట ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత కల్వర్టుకు ఎదురుగా కొత్తగా నిర్మించాలని రైల్వే అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

యువత భవిష్యత్తును చిదిమేస్తున్న డ్రగ్స్ మాఫియా

నెల్లిమర్ల: యువత భవిష్యత్తును జగన్ డ్రగ్స్ మాఫియా చిదిమేస్తోందని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి విమర్శించారు. నెల్లిమర్లలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో మొదటి స్థానంలో ఉన్న ఏపీని జగన్‌రెడ్డి గంజాయి, డ్రగ్స్ రవాణాలో మొదటి స్థానానికి చేర్చారని ఆరోపించారు. విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తానని చెప్పి డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చారని ఆమె మండిపడ్డారు. ఈ సమావేశంలో టీడీపీ నగర పంచాయతీ అధ్యక్షురాలు బయిరెడ్డి లీలావతి, జిల్లా మహిళా విభాగం అధికార ప్రతినిధి కింతాడ కళావతి తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల నిరసన


ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నెల్లిమర్లలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మిమ్స్ కళాశాల ప్రధాన గేటు సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ గత 54 రోజులుగా వీరు నిరసన దీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నిరసన దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి విజయనగరం-చీపురుపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు. బకాయి డీఏలు చెల్లించాలని.. సస్పెండైన ఉద్యోగులను విధుల్లో చేర్చుకోవాలని తదితర డిమాండ్లు చేశారు. సీఐటీయూ అనుబంధ వర్కర్స్ యూనియన్ నాయకుడు సురేష్, కిల్లంపల్లి రామారావు, మిమ్స్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతమొందిద్దాం

- పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు
- గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'
- సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

అరాచక పాలనను అంతమొందిద్దామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పలు చోట్ల సోమవారం వారు పర్యటించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ మ్యానిఫెస్టోపై వివరించారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

- సాలూరు నియోజకవర్గ అభ్యర్థి సంధ్యారాణి

సాలూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి దోహదపడాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. సాలూరులోని తన నివాసంలో సోమవారం ఆమె నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. అనంతరం పట్టణంలోని 15వ వార్డు పెదయాత వీధి, కుమ్మరి వీధులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి, మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, అక్యాన అప్పారావు, యాసర్ల అప్పారావు, అల్లం శ్యామల, బలగ పైడిరాజు, రమాదేవి, కనకారావుతో పాటు పలువురు టీడీపీ జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


క్యాడర్‌కు దిశా నిర్దేశం చేస్తున్న సంధ్యారాణి

టీడీపీతోనే బీసీలకు న్యాయం

- కురుపాం నియోజకవర్గ అభ్యర్థి జగదీశ్వరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి

గరుగుబిల్లి: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని కురుపాం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. సన్యాసిరాజుపేట గ్రామంలో సోమవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వైసీపీ అనుసరిస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, తవిటినాయుడు, కె.భరత్‌కుమార్, పి.పూర్ణచంద్రరావు, వి.దివాకర్, వై.శ్రీనివాసరావు, ఆర్.గోవిందరావు, కె.అరుణ్‌కుమార్, జి.కృష్ణ, ఎం.సింహాచలంనాయుడు, వై.శ్రీనివాసరావు, సీహెచ్ దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపేద్దాం

- పార్వతీపురం నియోజకవర్గ అభ్యర్థి విజయచంద్ర


పార్వతీపురం రూరల్: విజయచంద్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: రాష్ట్రాభివృద్ధిని ఐదేళ్లు వెనక్కి పంపించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేద్దామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కొత్తవలస 7వ వార్డు గిజబ కాలనీలో టీడీపీ శ్రేణులతో కలిసి బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పాలనా పగ్గాలు చేపట్టాలంటే ప్రతిఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఆయన కార్యకర్తలతో కలిసి హోలీ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరాడ నారాయణరావు, మజ్జి వెంకటేష్, కోలా మధు, డాక్టర్ భాను ప్రసాదు, జి.రవికుమార్, పి.రాజశేఖర్, ఎస్.బాషా, ఆర్.అనంత్ పాల్గొన్నారు. ● **పార్వతీపురం రూరల్:** కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర సోమవారం ఎంఆర్ నగర్‌లో పర్యటించారు. స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ ద్వారపు రెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఉన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి, నాయకులు సిదార్థ వెంకట్ నాయుడు, గొట్టాపు వెంకట్‌నాయుడు, రొంపిల్లి సుభద్ర, గుంపస్వామి, జాగాన రవిశంకర్, జి.రామ్మూర్తి, జనసేన నాయకుడు ఆగూరు మనీ, బీజేపీ నాయకుడు పారిచర్ల అప్పారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ

హోలీ పండగను సోమవారం పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలపుకున్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


భోగాపురంలో..


గుమ్మలక్ష్మీపురంలో..


సాలూరు రూరల్: తోణాంలో..


వీరఘట్టం: హోలీ నిర్వహిస్తున్న దృశ్యం


జామి: చింతాడలో..


మక్కువ: చిన్నారులతో హోలీ సంబరాల్లో పాల్గొన్న ఆర్పీఎఫ్ సిబ్బంది


పాలకొండ: హోలీ వేడుకల్లో ఆర్పీఎఫ్ పోలీసులకు స్వీట్లు పంచుతున్న డీఎస్పీ కృష్ణారావు


చీపురుపల్లి: పాత కుమ్మరి వీధిలో..


గరివిడిలో..

ఎన్నికల నియమావళిపై అప్రమత్తం

గరుగుబిల్లి: గ్రామాల్లో విధిగా ఎన్నికల నియమావళిని పాటించాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ అన్నారు. సోమవారం రావుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల కోసం ప్రత్యేకంగా నియమించిన బృందం సభ్యులతో కలిసి ఎంపీడీవో పర్యటించారు. ఎన్నికల కమిషన్ నియమాలు తూచా తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఎఫ్ఎస్‌టీ అధికారులు బి.గౌరీశంకరరావు, పంచాయతీ కార్యదర్శి ఎ.మోహనరావు, పోలీస్ కానిస్టేబుళ్లు పి.ఉమామహేశ్వరరావు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** చిట్టిపూడివలస గ్రామంలో ఎన్నికల బృందం సభ్యులు సోమవారం పర్యటించారు. ఎంపీడీవో ఎంవీటీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో విధిగా ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు సంబంధించి ఫ్లెక్సీలు, జెండాలు వంటివి ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


గరుగుబిల్లి: రావుపల్లిలో పర్యటిస్తున్న అధికారులు,


వీరఘట్టం: చిట్టిపూడివలసలో..

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గజపతినగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీఎం జగన్ ఫొటోతో ఉన్న పౌష్టికాహారం పంపిణీ జరుగుతున్నట్లు, రైతు భరోసా కేంద్రంపై జగన్ ఫొటో ఉందంటూ వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ప్రాజెక్టు పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో రాజకీయ నాయకుల స్టిక్కర్లపై తెల్ల కాగితాలు అతికించి, పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆదేశించినట్టు పీవో నాగమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మదుపాడ రైతు భరోసా కేంద్రం భవనంపై జగన్ బొమ్మను కార్యదర్శి రోషి, సిబ్బంది సాయంతో సోమవారం తొలగించారు.

మీటర్లపై స్టిక్కర్లు తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతానగరం: వ్యవసాయ విద్యుత్ మీటర్లకు జగన్ చిత్రాలతో ఉన్న బాక్సులు ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా తొలగించకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'కోడ్ పాటించరా' శీర్షికతో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఎఫ్ఎస్‌టీ టీం వన్ అధికారి చిన్నారావు ఆధ్వర్యంలో గుడ్డిపేట, లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస రెవెన్యూ పరిధిలో కొన్ని మీటర్లపై ఉన్న జగన్ చిత్రాలను తొలగించారు. రెండు రోజుల్లో విద్యుత్ క్షేత్రస్థాయి సిబ్బందితో మండల పరిధిలో అన్ని మీటర్లపై ఉన్న చిత్రాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఈశ్వరరావు తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి జయంతి ఉత్సవాలు


సాలూరులో..


చీపురుపల్లిలో..


రాజాం రూరల్: శాస్తా సమాజంలో..

సాలూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వేకువజాము నుంచే పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తిరువీధి నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఏర్పాటుచేశారు. ● **చీపురుపల్లి:** అయ్యప్పస్వామి జయంత్యుత్సవాలను పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రెడ్డిపేట సమీపంలోఉన్న రమణ గురుస్వామి సన్నిధానంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయప్పస్వాములు పల్లకి సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి గురుస్వామి శ్రీరామశర్మ, కెల్ల గోపీకృష్ణ, సన్నిధానం సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** స్థానిక శాస్తా సమాజంలో అయ్యప్పస్వామి జయంతి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శాస్తా సమాజం పీఠాధిపతి ఉమాపతిశేష గురుస్వామి, చంటి స్వామి, రాజు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానంలో గత ఐదు రోజులుగా నిర్వహించిన మాధవస్వామి, భూభుజంగ వరాహ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం, పుష్కరిణి వద్ద చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని గోవిందరాజస్వామిని, సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను దేవాలయం కొండ మెట్ల దగ్గర ఉన్న డోల మండపం మీదకు స్వామివారిని పల్లకితో ఊరేగింపుగా తీసుకువెళ్లి అక్కడ డోలోత్సవం నిర్వహించారు.

మద్యం సీసాల ధ్వంసం

గంట్యాడ: మండలంలోని వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను పోలీసు, ఎక్సైజ్ అధికారులు సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ధ్వంసం చేశారు. 14 ఎక్సైజ్ కేసుల్లో 347 మద్యం సీసాలు పట్టుకున్నారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్టు ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

పటిష్ఠంగా బందోబస్తు నిర్వహించాలి

భోగాపురం: పోలీస్ బందోబస్తు పటిష్టంగా నిర్వహించాలని సీఐ ఎ.రవికుమార్ సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ భోగాపురం, పోలిపల్లి గ్రామాల్లో శ్రీకనకదుర్గమ్మ, పోలిపల్లి పైడితల్లమ్మల జాతరలో బందోబస్తుకు 150 మంది సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలని.. భక్తులతో మర్యాదగా మెలగాలని సూచించారు.

సమస్యలుంటే విన్నవించండి

పాలకొండ: ఇంటర్మీడియట్ పరీక్షా పత్రాల మూల్యాంకనం సందర్భంగా విశాఖపట్నంలోని క్యాంప్ ఆఫీసర్ పి.మురళీధర్‌ను పార్వతీపురం మన్యంతో పాటు వివిధ జిల్లాలకు చెందిన వృత్తివిద్యా కోర్సుల అధ్యాపకులు సోమవారం కలిసి, హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకనంలో ఏమైనా అసౌకర్యాలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం ఆయన్ని సన్మానించారు.